# నీ తప్పుకి వారసురాలిని



ఎస్కె కమలారాణి

"చెందీ!"

బొంగురుపోయింది ఆనందరావు కంఠం.

"ఎందుకు నాన్నా అంత బాధపడ తావు!" చెక్కుచెదరకుండా నవ్వుతూ అంది చెందీ.

"కాని, ఇలా జరగాలని కాదమ్మా నేను కోరుకున్నది. పట్టుమని పాతికేళ్లు లేని నీ వయసెక్కడ? యాభైకి దగ్గ రవుతున్న రాజశేఖరంగారి వయసు ఎక్కడ? కాకి ముక్కుకి దొండ పండులా అతని రూపం ముందు అందాల బరిణలాంటి నిన్ను ఊహించను కూడా లేనమ్మా! వీల్లేదు. ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు."

"జరుగుతుంది నాన్నా. జరిగి తీరు తుంది. ఇది నా నిర్ణయం" తొణక్కుండా అంది చెందీ.

భార్యను, ఇద్దరు పిల్లలను పోగొట్టు కుని ఏకాకిగా బ్రతుకుతూన్న రైస్‌మిల్లు ప్రొప్రైటరు రాజశేఖరంగార్ని చెందీ పెళ్లాడుతుందంటే మతిపోతూన్నట్లుంది ఆనందరావుకి.

"నీ నిర్ణయం కాదమ్మా ఇది. నిన్ను ఎవరో ఉసిగొలుపుతున్నారు," ఆనంద రావు కంఠం పూడుకుపోతూంది.

"ఎవరూ కాదు నాన్నా! నన్నీ నిర్ణయం తీసుకోమన్నది మన యింటి చరిత్ర!" పుట్టెడు బాధను పెదవుల మధ్య బంధించి బింకంగా నవ్వింది చెందీ.

గతంలోకి చూస్తున్నాడు ఆనందరావు.

* * *

సుందరి, ఆనందరావుల్ని చూసిన వాళ్లంతా అందం, ఆనందం కలిసి కాపురం చేస్తున్నాయనేవారు. ఇంజనీ రింగ్ డిగ్రీ, ప్రైవేట్ ఫర్మ్‌లో ఉద్యోగం, అందమైన భార్య, కలతలు లేని దాంపత్యం - కమ్మని కలగా మొద లైందతని సంసారిక జీవితం.

ఆనందరావుకి తండ్రదంటే ప్రాణం. తల్లిలేని లోటు తెలియకుండా పెంచి

పెద్దచేసి, ఇంతవాడిని చేసిన ఆ ముసలి తండ్రి నెలా సుఖపెట్టగలనా అన్నదే అతని ధ్యాస. తండ్రి తప్ప ఇతర బాధ్యతలు లేవు.

ఆనందరావు ఎన్నిచేసినా 'ముందొక మనవడిని కని ఇవ్వరా చాలు!' అనే వాడు తండ్రి. నాన్న అల్పసంతోషి అని మురిసిపోయేవాడతను.

మొదటిసారి సుందరి పురిటి కెళ్ళింది. జ్యోతిష్యం ప్రకారం తనకు మగపిల్లడే పుట్టాలి అనుకుంటూ మామగారి దగ్గర నుంచి టెలిగ్రాంకోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తున్నాడు ఆనందరావు. తండ్రి ముఖంలో వెలుగు చూడాలని అంతకంటే తహతహలాడుతున్నాడు.

ఆడపిల్ల పుట్టింది. 'పోన్లేరా లక్ష్మి వెలిసిం దింట్లో' అని తనే ముందు సర్దు కున్నాడు తండ్రి - కొడుకు ఎక్కడ చిన్నముఖం చేసుకుంటాడోనని భయ పడుతూ.

కూతుర్ని చూడగానే ముందులో స్వల్పంగా కలగిన అసంతృప్తి మరచి పోయాడు ఆనందరావు. అచ్చుగుద్దినట్లు అంతా తన పోలికే - అయితే రంగులో సుందరి పోలిక రావాలనుకున్నాడు. రాలేదు. అయినా ముద్దులొలుకుతూంది పాప అనుకున్నాడు.

"అమ్మాయిగారి రంగు కాస్త పంచితే తరిగిపోతుందా ?" అన్నాడు మురిపెంగా భార్యతో.

"పోలిక మీదీ రంగు నాదీ కావాలా! అబ్బ! ఎంతాశ. అయినా నా బంగారు తల్లికేం తక్కువొచ్చిందండీ ?" అంటూ పాపను గుండెలకు హత్తుకుంది సుందరి.

"సరే అయితే. ఇప్పుడే చెప్పే స్తున్నా. ఈమారు బాబునే కనాలి. రంగు రూపం అన్నీ తమవే. మేమేం జోక్యం కలిగించుకోం!" అన్నాడు తల ఊ కొడుతూ.

"బాగుంది వరస!" పువ్వులు జల్లి నట్లు నవ్వింది సుందరి.

పువ్వుల జల్లులాగే రెండేళ్లు దొర్లి పోయాయి. లక్ష్మి వచ్చీరాని మాటలతో ముద్దుగా ఇల్లంతా కలయదిరుగుతోంది. రెండవసారి పాపాయి నెత్తుకుందుకి పుట్టింటి కెళ్ళింది సుందరి.

"క్రిందటిసారి మనం అన్నది గుర్తుందా ?" రైలెక్కిస్తూ గుట్టుగా అడిగేడు భార్యని.

"గుర్తుంది కాని, రోజురోజుకీ మీ అల్లరెక్కువవుతూంది. మీచేత మరో కన్యాదానం చేయించాలనుంది" కొంటెగా నవ్వి.

రెండవసారీ ఆడపిల్లనే కన్న సుందరి తప్పుచేసినట్లు ఆనందరావు ముందు తలొంచుకుందెందుకో.

"అయితే నా అల్లరికి పనిష్మెంటు ఇచ్చావన్నమాట'" అనేసాడతను బుజ్జ గింపుగా. లోలోపల అసంతృప్తిని మాత్రం బయటపెట్టలేదు.



కళ్యాణి పుట్టిన రెండేళ్ళకి మళ్ళీ నీళ్ళాడిన సుందరి ఈసారైనా కొడుకు నివ్వమని కనపడని దేవుళ్ళందరికీ మొక్కింది. ముగ్గురు పిల్లలతో సంసారం ముచ్చటగా ఉండాలని ఆపరేషన్ చేయించేసుకోవాలని అనుకుంది.

కాని, మూడోసారి కూడా ఆడపిల్లే. బంగారుబొమ్మలా మెరిసిపోతున్న పాప ముందు లక్ష్మి కళ్యాణి ఎందుకు పనికిరా దనిపిస్తూంది. కాని ఏం లాభం? ఆనందరావుకి కాని, సుందరికి కాని పీసమెత్తు సంతోషం కలగడంలేదు.

'నా కింతే ప్రాప్తం కాబోలురా' అంటూన్న తండ్రి ముఖం చూడలేక పోయాడు ఆనందరావు.

ముగ్గురాడపిల్ల లనగానే గుండెలో

చల్లగా అయిపోతున్నా ఆపరేషన్‌కి అంగీకరించలేదతను. 'కొడుకు పుట్టాలి. నాన్న చూడాలి' అన్నాడు మొండిగా.

ముగ్గురు పిల్లలతో సతమతమయిపో తున్న సుందరి చీదరగా చూసి కళ్లు మూసుకుంది.

నామకరణాలూ — మహోత్సవాల ముచ్చట పెద్దపిల్లలిద్దరితో తీరిపోయింది. పొరుగింటి హిందుస్థానీ దంపతులు 'చాంద్ కా టుకుడా' చాంద్ - చాంద్ అనగా మూడోపిల్ల ఇంటా బయటా అందరికీ చెందీ అయింది. ఊరూ, వాడా అంతా ఆ పిల్లని చూసి ముచ్చటపడు తూంటే క్రమంగా ఎలాగో తేరుకున్నా రా దంపతులు.

మరుసటి సంవత్సరం ఆనందరావు పనిచేస్తున్న కంపెనీ దివాలా తీసింది. మరో ఉద్యోగం వెతుక్కొని స్థిరపడ బోయేసరికి అతని తలప్రాణం తోక కొచ్చింది. ఆ యేడే చచ్చినంత జబ్బు పడిలేచాడతని తండ్రి. నీళ్ళల్లా డబ్బు ఖర్చవతోందో ప్రక్క - మనశ్శాంతి పోతోందో పక్క.

బుర్ర వేడెక్కిపోతూన్న అతని కో రోజు భయపడుతూనే చెప్పింది సుందరి నాలుగోసారి మళ్ళీ అతను తండ్రి కాబోతున్నాడని.

నిండా మునిగినవాడికి చలేమిటన్న ధీమా చూపించాడతను. పంతం, పట్టు దల నరనరాలా ప్రాకిపోయి ఉంది.

'ఆడపిల్ల పుట్టింది' అంది నర్స్.

"థాంక్స్," కసిగా అంటూ జేబు లోంచి పదిరూపాయలు తీసి ఆమె చేతిలో పెట్టాడతను. అతని మనస్తత్వ మేమిటో తెలియ దెవ్వరికీ.

ఆనందరావుకో కొత్త దిగులు పట్టు కుంది. నాలుగోపిల్లకంత నలుపెలా వచ్చిందో అతని కర్థం కాలేదు. అటు సుందరివంకగాని, ఇటు తనవంకగాని అంతటి నల్లటివాళ్లెవరూ లేరు. మగ పిల్లడు కలగకపోయినా ఇన్నాళ్లూ నా పిల్లలకేం? అందాల బొమ్మలు అన్న ధీమాతో ఉన్నాడు. ఇప్పుడిదో కించ. ఆ పిల్ల పేరేమిటో ఎవ్వరికీ తెలియదు కాని నల్లచెల్లి అంటే ఇట్టే అర్థమై పోతుందందరికీ.

పదేళ్లు కాలగర్భంలో కలిసిపో యాయి. మనవడికోసం కలవరించిన ఆనందరావు తండ్రి పక్షవాతంతో మంచాన పడ్డాడు. ఆనందరావు పరిస్థితి ఇక చెప్పనక్కర్లేదు.

రెండేసి యేళ్ల కోమారు కాన్పులతో విసుగెత్తిపోయిన సుందరికి ఇప్పుడు ప్రాణం కాస్త తెరిపినపడ్డట్టుంది. కాని కొడుకు పుట్టలేదన్న భర్త అసంతృప్తి ఆమెను హాయిగా ఉండనివ్వటం లేదు.

ఇక పిల్లల వరకు వస్తే నలుగురివీ నాలుగు దారులు. లక్ష్మికి మొదటి బిడ్డగా చెప్పలేని గారాబం జరిగింది. తండ్రిలాగే మొండితనం జాస్తి. తనన్నది కావాలన్న

పట్టుదలెక్కువ. ఫాషన్లు, సరదాలే తప్ప ఇంకో గోడుపట్టదు. కల్యాణికి పుస్తకం చేతిలో ఉంటే చాలు. పొద్దెరగదు. ఆమెదో లోకం. ఆఖరుదానికి ఇంటి కంటే గుడి పదిలమనే మనస్తత్వం. ఆట, పాటలతో ఎక్కడో గడిపేస్తూం టుంది.

ఎటొచ్చీ సుందరికి చెందీ పేరే నోటిముందుంటుంది. ఏ పని సాయం కావాలన్నా చెందీయే కళ్ళముందుగా ఉంటుంది. మిగిలిన వాళ్ళెవ్వరూ ఒక్క పని ముట్టుకోరు. రూపానికి తగ్గ గుణం చెందీది. ఎవరేమన్నా నోరెత్తకుండా తన పని తను చేసుకుపోతూంటుంది. మెప్పు, గుర్తింపు కావాలని కూడా చూడదు. అందుకే ఆనందరావుకి చెందీ అంటే ప్రత్యేకమైన అభిమానం.

ఏదోలా రోజులు గడుస్తున్నాయి.

నలుగురు పిల్లలతో, చాకిరీతో చిక్కి శల్యమయిన సుందరి 'అమ్మయ్య!' అని తేలికగా ఊపిరి తీసుకోబోతున్నం తలో పిడుగుపాటులా తోచింది– తను మళ్ళీ తల్లి కాబోతూన్న విషయం. ఘోరాపరాధం చేసినట్టు ఎవరి కళ్లా పడ లేకపోతూంది.

ఆనందరావు మాత్రం అందలం ఎక్కినట్టు పొంగిపోయాడు. ఎంత సంపాదించినా ఎవరినీ సంతృప్తిపరచ లేకపోతూన్న ఆ సంసారంలోకి మరో జీవి వస్తూందంటే ఇసుమంతైనా భయ పడినట్లు కన్పించలేదు. మీదు మిక్కిలి నాకు కొడుకు పుట్టే యోగం ఉంది, దాన్నెవరు తప్పించగలరు' అని గొప్పగా చెప్పుకోసాగేడు. ఆరు నెలలనుండి పక్షవాతంతో తీసుకుంటూన్న తండ్రి మనవడి కోసమే బ్రతికి ఉన్నాడన్పిం చింది– అతనికి. ఆ ఆనందంలో సమస్యలన్నీ పరిష్కారమైపోయినట్లు తోచింది.

తన పిల్లలంతా రూపవంతులే. పెళ్ళి కొడుకులే వెతుక్కుంటూ వస్తారు తనింటికి. చెందీ కోసమైతే ప్రత్యేకంగా ఏ రాకుమారుడో దిగిరావాలంతే.ఎటోచ్చీ, ఆఖరి పిల్ల–కాస్త నలుపు అంతేగా! ఏదోలా కష్టపడి ఆ ఒక్క పిల్ల పెళ్ళీ చెయ్యలేడా తను? ఇలా సాగేవతని ఆలోచనలు.

అతను పదహారేళ్ళ నుండి ఎదురు చూసిన శుభఘడియ రానే వచ్చింది. ఒక్క కొడుకు చాలనుకుంటే ఇద్దరు పుట్టేరు– కవల పిల్లలు. అతను సంతో షంతో ఎంత ఉబ్బితబ్బిబ్బవుతున్నాడో ననుకుంటారు చూడని వాళ్ళంతా. కాని, ఆనందరావు ముఖంలో కళాకాంతి లేవు. ఆ కబురు విని 'ఆహా!' అన్నాడు అతి నిర్లిప్తంగా. అప్పటికతని తండ్రి గతించి నెల్లాళ్లయింది.

ఆనందరావు కప్పట్నుంచే సంసారం భారంగా తోచడం ప్రారంభించింది. ఆరుగురు పిల్లలంటే గుండె గుభేల్

మంటూంది. ఇన్నాళ్లూ తనెందుకు భయపడలేదానని అతనే ఆశ్చర్యపోతున్నాడు. కొడుకులు కలిగారన్న ఏ కాస్త సంతృప్తినో భయాలే మింగేస్తున్నాయి.

ఆ పిల్లలు పుట్టేక సుందరి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది.

పిల్ల లెదుగుతున్నారు.

లక్ష్మికి ఇరవై నిండేయి. పెళ్లి కొడుకు లెవరూ వెతుక్కుంటూ రాలేదు. సుందరిపోరు పడలేక తనే సంబంధాలు వెతకడానికి బయలుదేరాడు. అందమైన పిల్లలకు కూడా అంత కష్టపడి పెళ్లి చెయ్యవలసోస్తుందనుకోలేదతను. ఉన్న కాస్త పొలం ఏనాడో కరిగిపోయింది. ఇల్లు తనఖాపెట్టి లక్ష్మి పెళ్లి అయిందని పింఛేసరికి కళ్లు తిరిగినంత పనయింది.

పుస్తకాల పురుగు అనుకున్న కల్యాణి పరీక్ష ఎందుకు తప్పిందోనని తీగెలాగితే డొంక కదిలింది. ఈ మధ్య కల్యాణి క్లాసు పాఠాలు చదవడం మానేసి కంట్రాక్టరు భూషణరావు కొడుకు వినోద్ చెప్పే ప్రేమ పాఠాలుమాత్రమే వింటూందని తెలిసింది. అందరి తండ్రుల్లాగ ఖస్సు మనలేదు ఆనంద రావు. ఎంతో పెద్ద మనసుతో పొంగి పోయాడు. తన బిడ్డ లక్షాధికారుల కోడలు కాబోతూందనుకుంటే అతనికి మహా సంతోషంగా ఉంది. గర్వంగానూ ఉంది.


'వెఱ్ఱి తల్లీ! ఈ మాత్రానికి దిగులెందుకమ్మా. భూషణరావుతో మాట్లాడి అంతా 'సెటిల్ - చేస్తానుండు' అన్నాడు ధీమాగా. కాని, అక్కడే చుక్కెదురయింది. వినోద్ మార్కెట్ వాల్యూ లకారం పలుకుతూందని తెలియగానే నీరుగారి పోయి నా వల్లగాదని ఓ దండం పెట్టేసాడు.

అయితే ఇల్లు నరకంలా తయారయింది. ఆ సందట్లోనే లక్ష్మి పురుటి కొచ్చి కొడుకు నెత్తుకుని వెళ్లింది. వినోద్‌ని తప్ప ఇతరుల్ని పెళ్లాడనని పట్టుపట్టేసింది కళ్యాణి. ఏం చెయ్యాలో దిక్కుతోచక అల్లల్లాడుతున్న రోజుల్లో వినోద్ వచ్చాడు.

అటు ప్రేమను, ఇటు డబ్బును వదులుకోలేని ఆ అబ్బాయి 'ఏం చేస్తాం? పోనీ మీ పెద్దమ్మాయి కిచ్చినట్లు ఇవ్వండి చాలు. అదీ, మా నాన్న సంతృప్తి కోసం' అంటూ ఎంతో త్యాగంగా చూసేడు. ఇంకా జాప్యం చేస్తే కల్యాణి ఏమి అఘాయిత్యం చేస్తుందోనని భయపడిన ఆనందరావు కిక్కురుమనకుండా ఒప్పుకున్నాడు.

ఫలితం, తనఖాలో ఉన్న ఇల్లు అమ్ముడైపోయి గూడుపోయిన పక్షుల్లా బయటపడ్డారంతా.

సంసారం సాగరం అనెందుకన్నారో అతనికి బాగా తెలిసొస్తూంది. తనకు, తనవాళ్లకు శాంతి సౌఖ్యాలు లేవు. తన తెలివితక్కువతకు అసమర్ధతకు తనని




తాను తిట్టుకోని రోజులేదు. కాని పశ్చాత్తాపం వలన పరిస్థితులు చక్కబడిపోవు కదా!

ఆనందరావు రిటైరయ్యేనాటికి దారం తెగిన గాలిపటంలా ఉందా సంసారం. ఇంటరుతో తప్పనిసరిగా చదువు నాపుకోవలసి వచ్చిన చెందీమీద ఇంటిపోషణ భారమంతా పడిపోయింది. రాజశేఖరంగారి రైస్ మిల్లులో ఉద్యోగంచేసి ఆమె సంపాదిస్తూన్న నాలుగు వందలే ఆ ఇంటికాధారం.

ఓ రోజు ఉదయాన లేస్తూనే నల్లచెల్లి కన్పించలేదింట్లో. వెతగ్గా వెతగ్గా నల్లచెల్లి బదులు ఉత్తరం దొరికింది.

'చెందీ!

చెప్పకుండా వెళ్తున్నందుకు క్షమించు. నేను అందరిలాంటి మామూలు ఆడపిల్లని. నీ అంత సహనం, మనో నిబ్బరం నాకు లేవు. కోరికలు సరదాలు మాత్రం సగటు ఆడపిల్లల్లాగే ఉన్నాయి. అవి ఈ ఇంట్లో తీరవని నాకు బాగా తెలుసు. అందుకే నా దారి నేను చూసుకుంటున్నాను.

దేవుడెందుకో నన్ను మీ అందరికీ భిన్నంగానే సృష్టించాడు. ఏ లోపాలూ లేని ఇద్దరు పిల్లలకి పెళ్ళి చేయబోయే సరికే మనిల్లు ఎంత అధోగతి పాలైందో కన్పిస్తూందికదా.అందం దారి అందానిదే_ డబ్బు దారి డబ్బుదే అని తెలిసాక నీ పెళ్ళి మాత్రం అంత సుళువుగా అవుతుందని అనుకోగలనా! నేను నల్లటి దాన్ని. డబ్బు జల్లి పెళ్ళిచేసే స్థితిలో లేడు నాన్న. అందుకే నన్ను నచ్చిన, నేను మెచ్చిన మా సైన్సు టీచరు సత్యమూర్తిగారూ నేను దంపతులం కాబోతున్నాం. నీ లేత భుజాలమీద ఒక బరువు దిగినా మంచిదేనని నా ఉద్దేశ్యం.

ఇలా చెప్పకుండా వెళ్తున్నందుకు అమ్మ నాన్నల్ని క్షమించమని అడగాలని లేదు. ముందుచూపు లేకుండా వాళ్ళు చేసిన పొరపాట్ల ఫలితమే మనం అని నా నమ్మకం. చెయ్యని పాపానికి శిక్షను భవిస్తూన్నట్లుగా ఈ బరువు సంసారాన్ని నెత్తినేసుకున్న నిన్ను చూస్తేనే నాకు బాధగా ఉంటుంది. నిన్ను మాత్రం క్షమించమని కోరుతూ, ప్రేమతో

నీ

నల్ల చెల్లి'

ఏడవడానికి ఓపికలేని సుందరి కంట ఒక్క నీటిబొట్టూ రాలకపోతే ఎలాగో నిగ్రహించుకున్న దనుకున్నరంతా. మరో రెండు నెలలకా ఇంటితో బంధాల్నే తెంపుకుపోయింది సుందరి.

ఒకప్పుడు ఆనందానికి ప్రతిరూప మనుకున్న ఆనందరావు దుఃఖానికి మారు పేరయ్యాడు. అన్ని విధాల అధోగతి పాలయ్యేడు. ఇల్లు సత్రంలా తయారైంది. లక్ష్మి, కల్యాణి పెద్దింటికోడళ్లు వస్తారు. పబ్బాలు గడుపుకుంటారు. వెళ్తారు. వాళ్ళకది పుట్టిల్లు! దుక్కిటెద్దులా కష్టపడే చెందికి ఎప్పుడన్నా అతిగా కష్టమనిపించి ఏ మాత్రం నోరెత్తినా దుయ్యబట్టుతుంటా రిద్దరూ. వివేకం లెక్కనైనవాళ్ళకు ఎదుటివారి గోడు పట్టదు మరి!

ఆనందరావు లోలోపలే కుమిలి పోతున్నాడు. ఎప్పుడూ అతని ఆలోచన ఒక్కటే- చెందీ పెళ్ళి.

* * *

"ఏమిటి నాన్నా. అంతగా ఆలోచిస్తున్నావ్?"

చెందీ మాటకు ఉలికిపడి వర్తమానంలో కొచ్చాడు.

"నువ్వు కాదనకు నాన్నా. ఇదొక్కటే నా సమస్యలన్నిటికీ పరిష్కారం. నా బాధ్యతలతోపాటే నన్ను స్వీకరించడానికి అంగీకరించారాయన. కోరి నేను చేసుకుంటానన్న ఆయనను కాదనలేను. అన్నట్టు మరో ముఖ్యవిషయం!" అదోలా చూసింది చెందీ.

"ఆయన కిక పిల్లలు కలగరట. ఆ సంగతి తెలిసాకే నేనీ పెళ్ళికి ఒప్పుకున్నాను."

నెత్తిమీద పిడుగుపట్టయింది ఆనందరావుకి.

"చెందీ!" పేలగా అరిచాడు. కళ్ళు వర్షిస్తున్నాయి.

"బాధపడకు నాన్నా! తల్లిదండ్రుల ఆస్తులనేకాదు అప్పులనూ, తప్పులనూ కూడా పిల్లలు వారసులే. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఇక నా పిల్లలు అంటావా, వీళ్ళిద్దరూ నీ పిల్లలు కారూ?' అంటూ చెల్లెళ్ళిద్దరినీ దగ్గరికి తీసుకుంది చెందీ.

బంగారు చువ్వతో వాత లేస్తున్నట్లు విలవిల్లాడిపోయాడానందరావు. అతి మెత్తగా కన్పించే చెందే ఇంత కఠిన శిక్ష వేస్తుందనుకోలేదెప్పుడూ.